కథ

విశ్వపతి వాంటెడ్ కాలమ్ చదువుతున్నాడు. అతను నిరుద్యోగి గాబట్టి వాంటెడ్ కాలమ్ చూడ్డం నిత్యకృత్య మయిందనికి.

ఇంటర్‌మీడియెట్ పాసైన విశ్వపతికి, అప్లికేషను పెట్టుకునే అవకాశమే ఇంత వరకూ రాలేదంటే దానికి కారణం లేకపోలేదు. చాలా ఉద్యోగాలకి గ్రాడ్యుయేట్సు, ఆపైన చదువుకున్న వారినే కోరుతున్నారు. దరఖాస్తులు వాళ్లనుంచే ఆహ్వానిస్తున్నారు. ఔను మరి-గ్రాడ్యుయేట్స్ అధిక సంఖ్యలో లభిస్తున్నపుడు, ఇంటర్మీడియేట్సూ, మెట్రిక్యులేట్సూ ఎవరిక్కావాలి?

హఠాత్తుగా ఓ ప్రకటన మీద విశ్వపతి దృష్టి పడింది. ఇంటర్మీడియెట్ అభ్యర్థులు స్టెనోగ్రాఫర్ల కోసం దరఖాస్తులు పంపుకోవచ్చునన్నదే ఆ ప్రకటన. ఆసక్తితో చదివాడు. మొదట్లో ఉత్సాహం ఇనుమడించినా క్రమంగా ఆ ఉత్సాహం నీళ్లుగారి పోయింది. అన్ని అర్హతలూ అతనికి వున్నాయి. అయితే ఒకే ఒక్క అర్హత లేదు. ఇంటర్మీడియెట్ సెకండు డివిజన్లోగాని ఫస్ట్ డివిజన్లోగాని పాసయ్యుం డాలన్నది, అందులోని నిబంధన. కాని విశ్వపతి ఇంటర్మీడియెట్ పాసయ్యింది థర్డు డివిజన్‌లో. ఆ ఒక్క అర్హత లేకపోయి నందువల్ల ఇన్నాళ్లకి వచ్చిన ఈ ఒక్క అవకాశమూ అతని చేజారిపోయింది. నవనాడులూ కృంగిపోయాడు విశ్వపతి. నిరుత్సాహంతో నీరసపడిపోయాడు. క్షణం పాటు అచేతనంగా వుండిపోయాడు. అతని కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది.

అప్పుడు విశ్వపతికి ఆనాడు తండ్రి అన్న మాటలు జ్ఞప్తికి వచ్చినయ్. ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గర పడుతూవుంటే ఓ రోజు విశ్వపతి నుద్దేశించి తండ్రి అన్న మాటలవి.

''ఒరేయ్ విశ్వం, ఈరోజున ఉద్యోగాలకి ఎంతో పోటీ వుందిరా. నువ్వు బాగా కష్టపడి చదివి ఇంటర్లో ఫస్టుక్లాసు సంపాదించు కోకపోతే పై చదువులు చదవడానికీగాని, ద్యోగం సంపాదించడానిగ్గాని అవకాశాలు వుండవురా! పై చదువులకి వెళ్లకపోయినా ఉద్యోగమైనా సంపాదించు కోవాలి కదా! తండ్రిగా నీ శ్రేయస్సుని కాంక్షించే చెబుతున్నాను, తప్పించి నీమీద కోపంతో కాదురా. చదువుకోమని చెప్పగలనే గాని బలవంతంగా నీ చేత చదివించలేనుకదరా! నువ్వు ఇంకా చిన్న పిల్లాడివి కాదు. బాధ్యత తెలిసిన వాడివి. ఆపైన నీ ఇష్టం'' అంటూ తండ్రి అప్పట్లో సలహా ఇవ్వడం, విశ్వపతికి ఇప్పటికీ గుర్తుంది. ఆ మాటలే అతని చెవుల్లో గింగురు పెడుతున్నయ్. అయితే ఆరోజు అప్పుడే అక్కడికి వచ్చిన అమ్మ మాటలూ విశ్వపతి స్మృతిపథంలో మెదిలినయ్. ఆమె నాన్నకి వత్తాసు పలకలేదు. పైగా తనని వెనకేసుకొచ్చింది.

''అబ్బబ్బ! ఏవిటండీ వాణ్ణి వూరిక విసిగించేస్తారు! బాగా చదువుకోవాలన్న బాధ్యత, తపన, వాడికిలేదూ? రాత్రింబవళ్లు ఎంతో కష్టపడి చదువుతున్నాడు. ఆ పాటి బాధ్యత వాడికి లేదంటారా! చదువు చదువంటూ అదేపనిగా నస బెట్టకండి'' అంది అమ్మ.

అంతే! నాన్న మరేవీ మాట్లాడకండా ఓ నిట్టూర్పు విడుస్తూ నిష్క్రమించడం ఇప్పటికీ గుర్తుంది విశ్వపతికి. ఆనాడే గనక అమ్మ, నాన్నలా తనని మందలించి వుంటే తాను కష్టపడి చదివి ఇంటర్లో ఫస్టు క్లాసు కాకపోయినా సెకండు డివిజనైనా తెచ్చుకుని వుండేవాడేమో! కాని అలా జరగలేదు. అమ్మ తనని సమర్థించి విచ్చలవిడిగా బాధ్యతా రహితంగా తిరగడానికి అవకాశం కల్పించి తనకి మేలుకంటే కీడే ఎక్కువగా చేసిందని ఇప్పుడు భావిస్తున్నాడు విశ్వపతి. ఇప్పుడనుకుని ఏం లాభం? తరుణం మించిపోయింది... అనుకున్నాడు మనసులో.

ఇంక ఆ రీడింగు రూమ్‌లో వుండాలని పించలేదు విశ్వపతికి. అతని కళ్లల్లో పల్చని నీటి పొరలు గిర్రున తిరిగినయ్. పశ్చాత్తాపంతో పరితపించాడు. అక్కణ్ణించి దిగులుగా బైటపడి ఇల్లు చేరుకున్నాడు. నిస్పృహతో హాల్లోని కుర్చీలో కూలబడ్డాడు. భవిష్యత్తంతా అంధకార మయంగా అగుపిస్తోందనికి. అతని మెదడులో ఏవేవో ఆలోచనలు...

అప్పుడే లోపల్నించి వచ్చిన వేదవతి, కొడుక్కేసి చూసింది. వాడిలోని నిస్పృహని, నిరాశని, ఆందోళన్ని సూచాయగా అవగాహన చేసుకొంది. ఏదో జరిగి వుంటుందనుకుంది. ''ఏంరా విశ్వం అలా వున్నావు?'' కొడుకు మొహంలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించింది వేదవతి.

దుఃఖం వెల్లువలా పెల్లుబుక్కొచ్చింది, విశ్వపతికి.

''అమ్మా నాకు ఈ జన్మలో ఉద్యోగం దొరుకుతుందంటావా?'' నిస్పృహ ఛాయలు అతని మొహంలో తారాడుతూ వుంటే జీరవోయిన గొంతుతో అన్నాడు విశ్వపతి.

కొడుకు ఆవేదన్ని అర్థం చేసుకొంది వేదవతి. వాడి ఆవేదనని చూస్తూ వుంటే ఆమెకి ఆందోళన కలుగుతోంది. భయం పుడుతోంది. కాని ఏం చెయ్యగలదు? వాడికి వుత్సాహాన్ని, ధైర్యాన్ని నూరిపోయడం తప్పించి ఇంకేం చెయ్యగలదు?

''బాధ పడకురా అబ్బాయ్. ప్రస్తుతానికి దొరక్కపోయినా, ఎప్పుడో ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు. నువ్విలా అధైర్య పడితే ఎట్లా చెప్పు? మీ నాన్నగారు కూడా ఒక పక్క ప్రయత్నిస్తూనే వున్నారు కదా! కాస్త ఓపికపట్టు.'' అంది వేదవతి కొడుక్కు అనునయపర్చే ధోరణిలో.

''సహనానికైనా ఓ హద్దుంటుంది కదమ్మా! నాలో ఓపిక నశిస్తోంది. నా స్నేహితులు చాలామంది ఉద్యోగాల్లో చేరారు. కాని నేను మాత్రం ఇలా వుండిపోయాను. ఉద్యోగార్హత సంపాదించాలంటే గ్రాడ్యుయేట్నైనా కనీసం ఇంటరు సెకండు క్లాసులోనయినా పాసై వుండాలి. నాకు ఆ రెండు అర్హతలూ లేవు. నేను థర్డు క్లాసులో ఇంటరు పాసైన దురదృష్టవంతుణ్ణి. అందుకు కారణం ఎవరో తెలుసమ్మా?'' సూటిగా తల్లి మొహంలోకి చూస్తూ అన్నాడు.

''ఇంకెవర్రా? నువ్వే! ఇప్పుడు అనుకుని ఏం లాభంరా...'' తేలిగ్గా అంది వేదవతి.

''కొంతవరకూ నేనేనమ్మా! కాదన్ను. కాని పూర్తిగా నేనే బాధ్యుణ్ణి కాను.'' నిష్కర్షగా అన్నాడు విశ్వపతి.

తెల్లబోయింది వేదవతి. ఇదేవిటి వీడిలా అంటున్నాడు? అనుకుంది. ఆశ్చర్యంగా.

''ఏవిటీ? పూర్తిగా నువ్వు బాధ్యుడివి కావా? అయితే మరి ఎవర్రా బాధ్యులు?'' అంది.

''నువ్వు...'' సూటిగా చెప్పాడు, విశ్వపతి

నివ్వెరపోయింది వేదవతి. క్షణంపాటు ఆమె నోట మాటరాలేదు. ఇదేవిటి? వీడు చదువుకోపోడానికి తనే కారణమంటూ తనని దోషిగా నిలబెడు తున్నాడేవిటి?... ఆమె కేవీ అర్థం కాలేదు, ఎందుకలా అంటున్నాడో!

''నేనా?'' షాక్ తిన్నట్టుగా అంది వేదవతి.

''ఔనమ్మా నువ్వే! నా చదువు ఇలా తగలడ్డానికి, తద్వారా ఉద్యోగార్హత సంపాదించలేని పరిస్థితి ఏర్పడడానికి నువ్వే కారణం! నీకు గుర్తుందా అమ్మా ఇంటరు పరీక్షలు దగ్గర పడుతూవుంటే, నాన్నగారు నన్ను కష్టపడి చదవమని హితోపదేశం చేశారు. నేటి పరిస్థితుల్ని వివరించి చెప్పారు. ఆ సమయంలో నువ్వేం జేశావు? నాన్నగారిని సమర్థించలేదు. పైగా ఆయన నోరు నొక్కేసి నాకు వత్తాసు పలికావు. నాపట్ల నీకు వుండే గారబమే నీచేత అలా చేయించిందనుకో. ఫలితంగా నేను చదువుపట్ల శ్రద్ధ చూపలేకపోయాను. విచ్చలవిడిగా తిరిగాను. ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్న ధ్యాసే లేకపోయింది నాకు. ఏదో గుడ్డిలో మెల్లలా థర్డ్ డివిజన్‌లో పాసయ్యాను. అంటే, నీ గారాబమే నా భవిష్యత్తుకి అవరోధ మయ్యిందమ్మా!'' అన్నాడు బాధగా విశ్వపతి. అతని గొంతు జీరవోయింది.

వేదవతి, నిశ్చేష్టురాలైంది. భర్త ఎన్నోసార్లు ఈ ధోరణిలో మాట్లాడ్డం ఆమెకి గుర్తు కొచ్చింది. ఇప్పుడు కొడుకే స్వయంగా అంటున్నాడు. ఆలోచనల్లో పడిందామె. అప్పట్లో భర్త మాటల్ని పట్టించుకోలేదుగాని ఇప్పుడు కొడుకు అన్నట్టు నిజంగా 'తప్పు' తనదేనేమో!... ఆలోచనల్లో పడింది. ఈ నిజాన్ని అప్పట్లో గ్రహించ లేకపోయింది. భర్త చెబుతున్నా ఆయన మాటల్ని నిర్లక్ష్యం చేసింది. ఫలితాన్ని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తోంది. తనని దోషిగా నిలబెట్టి కొడుకు అన్న మాటలు వింటోంది... అనుకుంటూ పశ్చాత్తాప పడింది. ఆ పశ్చాత్తాపం, ఆమె గుండెని రగిల్చి వేసింది. కాని... కాని... ఇప్పుడు ఏమనుకున్నా యేం ప్రయోజనం? జరగవల్సిన కీడు జరిగేపోయింది. కొడుకు భవిష్యత్తుకి గండి వెయ్యడంలో పరోక్షంగా ఆమె గారాబమే ఆమె నిర్లక్ష్య వైఖరే పాత్ర వహించింది. అంటే... అంటే కొడుకు అన్నట్టు నిజమైన 'దోషి' తానేనన్నమాట!... నిజాన్ని గ్రహించింది వేదవతి చాలా ఆలస్యంగానైనా.

వేదవతి కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్. చప్పున ఆమె నోట మాట రాలేదు. చీర్ల చెంగుతో కళ్లొత్తుకుంటూ అక్కణ్ణించి వెళ్లిపోయింది వేదవతి.

విన్వెరబోవడం ఈసారి విశ్వపతి వంతయ్యింది. తల్లి కలత చెందుతూ వెళ్లిపోవడం అతన్ని కలచివేసింది. కాని ఏం చెయ్యగలడు!

అప్పుడే బైట్నుంచి వచ్చిన విశ్వపతి తండ్రి రాంబాబు విశ్వపతి భుజాన్ని తట్టాడు.

''అంతా బైట్నుంచి విన్నాన్రా అబ్బాయ్. జరిగిందేదో జరిగింది. ఇప్పుడు యేమనుకున్నా లాభంలేదు. మీ అమ్మ తన తప్పుని చాలా ఆలస్యంగా తెలుసుకుంది.

దోషి

— ప్రేమేంద్ర

జరిగిందానికి ఇప్పుడు చింతించి లాభం లేదురా అబ్బాయ్. నువ్వేం బాధపడకు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలే వుంటున్నాయా? ఓ ప్రయివేటు సంస్థలో నీకోసం ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తున్నాను. ఫలితం వుంటుందనే అనుకుంటున్నాను. నువ్వేం నిస్పృహ చెందకు...నిరాశ పడకు'! ధైర్యం చెప్పాడు రాంబాబు.

తన చెవుల్ని తానే నమ్మలేక పోయాడు విశ్వపతి. తండ్రి మాటలు అమృతపు సోనల్లా. తోచినయ్. ఏదో ఒకటి-ఉద్యోగం దొరికితే చాలనుకున్నాడు.

''మీరు ఎంత మంచివారు నాన్నా...'' అన్నాడు సంతృప్తిగా విశ్వపతి.

కొడుకు మొహంలో కొత్త వెలుగును చాలా రోజుల తర్వాత చూశాడు రాంబాబు. సన్నగా మందహాసం చేసాడు.

''తండ్రిగా నాకు మాత్రం బాధ్యత లేదను కుంటున్నావట్రా? ఈనాటి యువతీ యువకులు అక్కడే పప్పులో కాలేస్తున్నారు. తండ్రిని అర్థం చేసుకోవడం లేదు... సరేలే! ఇకనైనా హుషారుగా వుండు. ఏదో ఒకటి ఉద్యోగం దొరుకుతుందిలే! అదే మనసులో పెట్టుకుని బాధపడకు'' అనేసి లోపలికి వెళ్లిపోయాడు రాంబాబు.

విశ్వపతిలో ఆశాజ్యోతి వెలిగింది. తండ్రిని మనసులోనే అభినందించు కున్నాడు.